క్లుప్తంగా

రేపు 'భూ భారతి'పై అవగాహన

వాజేడు: మండల కేంద్రంలోని రైతు వేదికలో ఈనెల 23న భూ భారతి అవగాహన సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 22న జరుగాల్సిన అవగాహన సమావేశం అనివార్య కారణాల వలన వాయిదా పడినట్లు తెలిపారు. రైతులు, ప్రజలు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని సమావేశానికి హాజరు కావాలని కోరారు.

ఒకరికి జైలు

వాజేడు: యాక్సిడెంట్‌లో ముగ్గురి ప్రాణాలు పోవడానికి కారణమైన కోమెర బాబురావు అనే ముద్దాయికి ములుగు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ.2000 జరిమానా విధించినట్లు ఎస్సై రాజ్ కుమార్ సోమవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. 2018 సంవత్సరంలో అతడి సొంత వాహనంలో కూలీలను ఎక్కించుకొని పెద్దగొళ్లగుడెమ గ్రామానికి తీసుకువెళ్తూ మార్గ మధ్యలో వాహనాన్ని బోల్తా కొట్టించాడు. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. ఈ ఘటనపై అప్పటి ఎస్సై గుర్రంకృష్ణ ప్రసాద్, వెంకటాపురం(కె) సీఐ రవీందర్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రాసిక్యూషన్ తరుపున పీపీ శ్యాం ప్రసాద్ కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా వాజేడు సీడీఓ నాగరాజు పీపీకి సహకరించినట్లు తెలిపారు.

వ్యక్తి బైండోవర్



కన్నాయిగూడెం: మండంలోని ముప్పనపల్లిలోని ఓ కిరాణం షాపులో నిషేధిత మత్తు పదార్థాలు అమ్మే వ్యక్తిని ఎస్సై వెంకటేశ్ అదుపులోకి తీసుకొని తహసీల్దార్ వేణుగోపాల్ ఎదుట సోమవారం బైండోవర్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఎస్సై మండలంలోని కిరాణ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ముప్పనపల్లికి చెందిన సంజీవ షాపులో ప్రభుత్వ నిషేధిత మత్తు పదార్థాలు గుర్తించి వాటిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని తహసీల్దార్ వేణుగోపాల్ ఎదుట బైండవర్ చేశారు. అతడి వద్ద నుంచి అగ్రిమెంట్ పత్రాన్ని తీసుకున్నట్లు తెలుస్తుంది. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



మంగపేట: మండలంలోని కమలాపురానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, యాదవ హక్కుల పోరాట సమితి నాయకుడు నిమ్మల రాంబాబు తల్లి గంగమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని వైహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు కుంట రవీందర్ యాదవ్ సోమవారం పరామర్శించారు. ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వామి, జిల్లా నాయకులు చంటి, అంతటి నాగరాజు, రవి, శ్రీనివాస్, దోమల నర్సయ్య, చీకుర్తి సుధాకర్, కిష్టయ్య, గంగుల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కోతుల దాడిలో ఇద్దరికి గాయాలు



గాయపడిన వృద్ధురాలు

మంగపేట: మండలంలోని కమలాపురం సీపీనగర్‌లో కోతులు దాడి చేసిన సంఘటనలో సోమవారం ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. సీపీనగర్‌కు చెందిన సరోజిని అనే వృద్ధురాలు ఉదయం 11 గంటల సమయంలో ఇంటి ముందు ఉతికి ఆరేసిన బట్టలను తీస్తుండగా ఒక్కసారిగా ఆమెపై కోతి దాడి చేసింది. ఈ దాడిలో తీవ్ర గాయాలయ్యాయి. అదే విధంగా గాజ కోమల అనే మహిళను కోతులు కరిచి గాయపరిచాయి. తీవ్రంగా గాయపడిన వృద్ధురాలును కుటుంబ సభ్యులు వెంటనే ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు. గ్రామంలో గత కొద్ది నెలల నుంచి కోతుల బెడద తీవ్రంగా ఉండటంతో పాటు ఇళ్లల్లో పనులు చేసుకుంటున్న వారిని, ఇంటి బయట ఆడుకుంటున్న చిన్నపిల్లలు, రోడ్డు వెంట వెళ్లే వారిపై దాడిచేసి గాయపరిచిన సంఘటనలు అనేకంగా చోటు చేసుకున్నాయి. దీంతో కాలనీ వాసులు ఎప్పుడు కోతులు దాడి చేస్తాయోననే భయంతో ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. గ్రామపంచాయతీ అధికారులు స్పందించి కోతుల బెడదను నివారించే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వేబ్రిడ్జిల వద్ద ఇసుక దందా!



కమలాపురంలో వేబ్రిడ్జి వద్ద లారీలో అదనంగా ఉన్న ఇసుకను తీస్తున్న పొక్లెయినర్



రాజుపేటలో..

- క్వారీల వద్ద లారీల్లో అదనంగా పోస్తున్న ఇసుక
- వేబ్రిడ్జిల వద్ద తీసి అమ్ముకుంటున్న నిర్వాహకులు

మంగపేట: మండలంలోని కొందరు వేబ్రిడ్జిల నిర్వాహకులు, రెవెన్యూ అధికారుల సహకారంతో కొత్తరకం ఇసుక దందాను కొనసాగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గోదావరి ఇసుక క్వారీలలో అదనపు బకెట్ దందా, పరిమితికి మించి కనీసం కేజీ ఇసుకను కూడా తరలించకుండా ప్రభుత్వం ప్రత్యేక నిబంధనలు విధించింది. ఈ మేరకు పోలీస్, రెవెన్యూ అధికారులను ఆదేశించింది. దీంతో ఇసుక క్వారీల్లో అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. కమలాపురంలో వేబ్రిడ్జి వద్ద రెవెన్యూ అధికారులు అక్రమంగా ఇసుకను తరలించకుండా తనిఖీ చేసేందుకు సిబ్బందిని నియమించారు. మంగపేట మీదుగా వెళ్లే లారీలను కమలాపురం వేబ్రిడ్జి వద్ద కాంటా పెట్టించి జేసీబీతో పరిమితికి మించి ఉన్న ఇసుకను తోడించి పంపిస్తున్నారు. ఇదే విధంగా రాజుపేట, చుంచుపల్లి వేబ్రిడ్జిల వద్ద పొక్లెయినర్‌తో లారీల నుంచి తోడించి పంపిస్తున్నారు. ఇసుక క్వారీల నుంచి లారీలో అదనంగా వచ్చే తోడించిన ఇసుకను కొందరు వేబ్రిడ్జి నిర్వాహకులు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై ట్రాక్టర్ రూ.18,00 నుంచి రూ.2,000 వేలకు స్థానికులకు విక్రయిస్తు సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ తరహ దందా కొనసాగించే నిర్వాహకులు మరో అడుగు ముందుకు వేసి గోదావరిలో ఇసుక క్వారీలో లోడింగ్ చేసే వారితో కుమ్మక్కై పరిమితికి మించి లారీలో ఇసుకను లోడింగ్ చేయించి ఆయా లారీలను వారి వారి వేబ్రిడ్జిలకు వచ్చే విధంగా మాట్లాడుకుని ఇసుక దందాను కొనసాగిస్తున్నట్లు విస్వసనీయ సమాచారం. రెండు నెలల నుంచి వందలాది ట్రాక్టర్ల ఇసుకను వేబ్రిడ్జిల వద్ద స్టాకు పాయింట్లను ఏర్పాటు చేసి విక్రయిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై కలెక్టర్, విజిలెన్స్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఇసుక క్వారీల్లో అనుమతులకు అదనంగా ఇసుకను లోడింగ్ చేసే వారితో పాటు అక్రమ దందాకు అడ్డుకట్ట వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఎలాంటి ఆదేశాలూ లేవు



ఇసుక క్వారీల నుంచి వచ్చే లారీలలో అదనంగా ఉన్న ఇసుకను తోడించి పంపిస్తున్న విషయం నిజమే. తీసిన ఇసుకను ఏమి చేయాలనే విషయంపై పైఅధికారలు నుంచి ఎలాంటి ఆదేశాలూ లేవు. తోడించిన ఇసుకను ఏమి చేయాలనే విషయంపై కలెక్టర్ నుంచి అనుమతి తీసుకుని తదుపరి చర్యలు తీసుకుంటాం.

- తహసీల్దార్ రవీందర్, మంగపేట

సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

- తహసీల్దార్ గిరిబాబు



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ గిరిబాబు

వెంకటాపురం(ఎం): మండలంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వెంకటాపురం తహసీల్దార్ గిరిబాబు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని నల్లగుంట, లక్ష్మీదేవిపేటలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు ఆయన హాజరై మాట్లాడారు. రైతులు ఎలాంటి భూసమస్యలు ఉన్న సదస్సులో దరఖాస్తు చేసుకుంటే సమస్యలను పరిష్కరిస్తామన్నారు. లక్ష్మీదేవిపేటలో 977 దరఖాస్తులు, నల్లగుంటలో 345 దరఖాస్తులు వివిధ భూసమస్యలపై వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఎర్రబెల్లి గోపాల్‌రావు, డీటీ చంద్రశేఖర్, ఆర్ఐ విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులు ప్రారంభం



ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న ఆశ వర్కర్

సాక్షి ఎఫెక్ట్..

ఎస్ఎస్ తాడ్వాయి: మండల కేంద్రంలోని ఎర్రకుంట చెరువులో ఉపాధిహామీ పనుల్లో భాగంగా పూడికతీత పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈనెల 19న 'సాక్షి'లో తాడ్వాయి గ్రామస్తులు 'ఉపాధి పనుల కోసం పడిగాపులు' అనే కథనం ప్రచురితం కావడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఈజీఎస్ అధికారులు స్పందించి గ్రామస్తులకు పని కల్పించారు. ఫీల్డ్ అసిస్టెంట్ రఘుపతి పూడికతీత పనులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కూలీలకు తాడ్వాయి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి ఆడెపు చిరంజీవి ఆధ్వర్యంలో ఆశ వర్కర్ బంగారు అరుణ ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఎండ దెబ్బ బారిన పడకుండా పని ప్రదేశంలో తీసుకోవాల్సిన జాగ్రతలపై అవగాహన కల్పించారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని వినతి



కలెక్టర్ కార్యాలయం వద్ద మహిళలు

మంగపేట: మండలంలోని పూరేడుపల్లి గ్రామానికి చెందిన మహిళలు తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల మంజూరీలో మొదట తమ పేర్లు వచ్చాయని, తర్వాత లీస్టులో తమ పేర్లు రాలేదని వాపోయారు. అర్హులైన వారికి ఇళ్లు మంజూరు విషయంలో అవకతవకలు చోటుచేసుకున్నాయని విషయాన్ని పరిశీలించి అర్హులైన తమకు ఇళ్లు మంజూరీ చేయాలని కోరారు. సప్క నర్సమ్మ, కవిత, అమ్రిన్, ఆశ, ఆదిలక్ష్మి, జైబున్నిసా, వజీర, రహ్మత్‌బి ఉన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

గోవిందరావుపేట: సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించవచ్చని పస్రా ఎస్సై కమలాకర్ అన్నారు. మండల కేంద్రంలోని కర్మేల్ ప్రార్థన మందిరంలో ప్రేమ్‌రాజ్, పలువురు చర్చిలో సీసీ కెమురాలు ఏర్పాటు చేయగా సోమవారం ఎస్సై ప్రారంభించి మాట్లాడారు. సీసీ కెమెరాలు నేరాల నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. చర్చిలో కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయం అని అన్నారు. మండలంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు, వ్యాపారస్తులు, యువత సహకరించాలని కోరారు.

ఉద్యమ స్ఫూర్తితో సభకు తరలిరావాలి



రజతోత్సవ సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రమేశ్‌రెడ్డి

- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి

ములుగు రూరల్: తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో వరంగల్‌లో నిర్వహించ తలపెట్టిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరు కావాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సానికొమ్ము రమేశ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కాశిందేవిపేటలో గ్రామ కమిటీ అధ్యక్షుడు అమర్‌సింగ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 27న నిర్వహించే రజతోత్సవ సభకు పార్టీ కార్యకర్తలు, నాయకులు, పార్టీ అభిమానులు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం నిర్వాహకులపై ఫిర్యాదు

ములుగు రూరల్: మండలంలోని బండారుపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులు దగా చేశారని జిల్లా అదనపు కలెక్టర్లు మహేందర్ జీ, సంపత్‌రావులకు ప్రజావాణిలో సోమవారం రైతులు ఫిర్యాదు చేశారు. వానాకాలం సీజన్‌లో లక్ష్మీ గణపతి రైతు సంఘం ఆధ్వర్యంలో బండారుపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహించి సుమారు 56 లారీల ధాన్యం కొనుగోళ్లు చేసినట్లు తెలిపారు. మిల్లర్లు కోతలు విధించకున్న నిర్వాహకులు మాత్రం క్వింటాకు 5 కేజీలు కట్ చేసి డబ్బులు చెల్లించారని అన్నారు. కట్ చేసిన ధాన్యం నిర్వాహకుల పేరున ట్రక్ షీట్ రాసుకొని డబ్బులు దండుకున్నారని ఆరోపించారు. రైతులను మోసం చేసిన లక్ష్మీ గణపతి రైతు సంఘం సెంటర్ నిర్వహన బాధ్యతలను తొలగించి పీఏసీఎస్ ద్వారా కొనుగోళ్లు చేయాలని, బాధ్యులపై చర్య తీసుకోవాలని అన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు

చిట్యాల: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కృష్ణ, సునీత అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో భాగంగా చిట్యాల మండలం జూకల్ ఉన్నత, ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బడిబాట ర్యాలీని నిర్వహించారు. వివిధ కూడళ్ల వద్ద మానవహారం నిర్వహించి సంస్కృతిక కార్యక్రమాలు కోలాటం, కరపత్రాల ద్వారా గ్రామస్తులకు ప్రభుత్వ బడుల ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ కావ్య, సూర్య నరేందర్, పుట్టపాక మహేందర్, పోలోజు సంతోష్, జంబుల తిరుపతి, దొంతి రాంరెడ్డి. తోట భిక్షపతి, జంబుల సురేందర్, కొమ్ము రవి, ఉపాధ్యాయులు రాధికారాణి, మమత, ఉమాదేవి, రంజిత్ కుమార్, స్వరూప, రూప మహమ్మద్ రఫీ, రవీందర్, శ్రీనివాస్, యోగానంద చారి, అనిల్ కుమార్, శ్రీనివాస్, కావ్య, మౌనిక, రామకృష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం

తొర్రూరు: క్రీడలతో ఆరోగ్యంగా ఉంటామని తొర్రూరు మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతిరెడ్డి అన్నారు. అనుమాండ్ల మాధవరెడ్డి స్మారకార్థం వాలీబాల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న ఉమ్మడి జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు ముగిశాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జట్లు పాల్గొనగా రఘునాథపల్లి జట్టు ప్రథమ స్థానంలో, మేడారం జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు గొడిశాల నగేష్, ఎంఈఓ బుచ్చయ్య, ప్రతినిధులు వాసిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, సూరం ఉపేందర్‌రెడ్డి, కొండం జనార్ధన్, హెచ్ఎం లక్ష్మీనారాయణలు తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాలు తరలిస్తున్న వాహనం సీజ్

- రాంపూర్ గోశాలకు 27 పశువుల తరలింపు



వాహనంలో అక్రమంగా తరలిస్తున్న పశువులు

ఏటూరునాగారం: డీసీఎం వాహనంలో అక్రమంగా మూగజీవాలను తరలిస్తుండగా సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై తాజొద్దీన్ పట్టుకుని సీజ్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని రొయ్యూర్ క్రాస్ వద్ద సోమవారం తెల్లవారు జామున పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా అక్రమంగా పశువులు తరలిస్తున్న డీసీఎం వాహనం కనిపించింది. వాహనాన్ని పరిశీలించగా అందులో 27 గోవులను తరలిస్తున్నారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో వాహనాన్ని అదుపులోకి తీసుకొని డ్రైవర్‌ను విచారించగా చర్ల మండలంలోని చుట్టుపక్కల ప్రాంతాల్లో గల పశువులను కొని హైదరాబాదుకు తీసుకెళ్లి అమ్ముకుంటున్నట్లు డ్రైవర్ తెలిపారు. అక్రమంగా పశువులను తరలిస్తున్న డీసీఎం వాహనాన్ని అదుపులోకి తీసుకొని డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. పశువులను వెటర్నరీ వైద్యులతో వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించి పశువుల సంరక్షణ కోసం భూపాలపల్లి రాంపూర్ గోషాలకు తరలించామన్నారు. ఎవరైనా అక్రమంగా మూగజీవాలను తరలిస్తే ఊరుకునేది లేదని చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అన్నారు. పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనుమానితులకు ఆశ్రయం కల్పించొద్దు



స్నాక్స్ పంపిణీ చేస్తున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి



బారికేడ్లను ఏర్పాటు చేస్తున్న పోలీసులు

- ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి

ఎస్ఎస్‌తాడ్వాయి: అనుమానితులకు ఆశ్రయం కల్పించవద్దని తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి గొత్తికోయలకు సూచించారు. సోమవారం తాడ్వాయి-పస్రా మార్గ మధ్యలో మండలతోగు గొత్తికోయగూడెంను ఆయన సిబ్బందితో సందర్శించారు. గూడెంలోని పిల్లలకు స్నాక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గూడెంలోని పిల్లలను పాఠశాలకు పంపించి విద్యబుద్ధులు నేర్పించాలన్నారు. చదువుకుంటే సమాజంపై పిల్లలకు అవగాహన కలుగుతుందన్నారు. సంఘవిద్రోహ శక్తులకు ఎలాంటి సహాయ సహకారాలు అందించొద్దన్నారు. అడవులను నరికితే, జంతువులను వేటాడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా కొండపర్తి స్టేజీకి కొద్ది దూరంలో మలుపు వద్ద ఇసుక లారీని మరమ్మతులు రావడంతో రోడ్డు పక్కన నిలిపివేశారు. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి స్పందించి రోడ్డు ప్రమాదాలు జరగకుండా రిఫ్లెక్టింగ్ స్టికర్లు గల బారికేడ్లను ఏర్పాటు చేశారు. మరమ్మతులతో రోడ్లపై వాహనాలను నిలిపితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. జలగలంచ సమీపంలోని హైవే రోడ్డుపై ఆదివారం రాత్రి వ్యాపించిన గాలిదుమారానికి చెట్లు కూలి రోడ్డుపై అడ్డుగా పడిన చెట్లను జేసీబీ సాయంతో తొలగించారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

- ఎంఈఓ వెంకటేశ్వర్లు



ఆట వస్తువులు పంపిణీ చేస్తున్న ఎంఈఓ

వాజేడు: విద్యార్థులు ప్రభుత్వం ద్వారా పంపిణీ చేస్తున్న ఆట వస్తువులను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ వెంకటేశ్వరవు అన్నారు. మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో సోమవారం పాఠశాలలకు తెప్పించిన ఆట వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ద్వారా మంజూరైన నిధులతో నాణ్యమైన ఆట వస్తువులు తెప్పించి ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు చదువులతో పాటు ఆటల్లో రాణించి పాఠశాలకు, మండలానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. 50 పాఠశాలలకు క్రీడా సామగ్రిని పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు ఉన్నారు.

అక్రమ పట్టాలను రద్దు చేయాలి



మాట్లాడుతున్న తాటి లక్ష్మణరావు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని వీరభద్రవరం, అంకన్నగూడెం గ్రామాల్లోని ప్రభుత్వ భూమిని కొంతమంది గిరిజనేతరులు అక్రమంగా పట్టాలు చేయించుకున్నారని ఆ పట్టాలను రద్దు చేయాని తెలంగాణ భూమిపుత్ర ఆదివాసీ సంఘం మండల అధ్యక్షుడు తాటి లక్ష్మణరావు అధికారులను కోరారు. సోమవారం మండల కేంద్రంలో తెలంగాణ భూమిపుత్ర ఆదివాసీ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీరభద్రవరం, అంకన్నగూడెం గ్రామాల్లోని ప్రభుత్వ భూమిని సర్వే చేయాలన్నారు. ఆక్రమించుకొని అక్రమ పట్టాలు చేసుకున్న వారిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు పూనెం నాగరాజు, తాటి శ్రీనాథ్, కోరం ప్రసాద్, పూనెం పవన్ కుమార్ తదితరులు ఉన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

- సీడీపీఓ రాధిక



కాళేశ్వరం: అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ రాధిక

కాళేశ్వరం: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని మహదేవపూర్ సీడీపీఓ రాధిక అన్నారు. సోమవారం మహదేవపూర్ ప్రాజెక్ట్ లెవల్ పోషణ పక్షోత్సవాలు, పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెడికల్ ఆఫీసర్ సుస్మిత, సీడీపీఓ రాధిక హాజరై మాట్లాడారు. రక్తహీనత నివారణ గురించి, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో మహదేవపూర్ ఎంపీఓ ప్రసాద్, ఏపీఎం రవీందర్, సూపర్‌వైజర్ నాగరాణి, రమాదేవి, శివరాణి, భాగ్యలక్ష్మి, వీణ, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ స్వప్న, ఎస్జీఓ సమ్మయ్య, అంగన్‌వాడీ టీచర్లు తల్లులు పాల్గొన్నారు.

రేగొండలో..

రేగొండ: మహిళలకు ఆరోగ్యకరమైన పోషకాహారం అందించడమే పోషణ పక్వాడ లక్ష్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి అన్నారు. పోషణ పక్వాడలో భాగంగా కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం అందిస్తుందని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే అక్రమ దత్తత, అక్రమ రవాణాపై అవగాహన కల్పించి, చైల్డ్ హెల్ప్‌లైన్ గురించి వివరించారు. అనంతరం బాల బాలికలకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లిగోరి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు మాధవీలత, అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, శ్యామల, సునీత, కీర్తన, రజిత, రత్న, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆలోచనలు ప్రపంచానికి స్ఫూర్తి

చిట్యాల: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనలు ప్రపంచానికి స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వెలుగు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ మేధావి అయిన అంబేడ్కర్ ఆశయాలకు అనుగునంగా ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. మూడు దశాబ్దాల పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని అంబేడ్కర్ జయంతీ రోజున రాష్ట ప్రభుత్వం అమలు చేయడం గర్వకారణమన్నారు. అనంతరం విగ్రహ దాత విశ్రాంత డీడబ్ల్యూవో చెన్నయ్యని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గోల్కొండ భిక్షపతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, జిల్లా నాయకులు మొకిరాల మధువంశీకృష్ణ, అంబేడ్కర్ వాదులు పుల్ల మల్లయ్య, సంగి రవి, కస్నూరి రమేష్, కై రత్, జన్నె యుగేందర్, పుల్ల ప్రతాప్, చిలివేరు సుమన్, దీవేందర్ పాల్గొన్నారు.